ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 5 ఏప్రిల్ 2025





ఊరిస్తున్న 'చేనేత' పోరు..

- ఏర్పాట్లతోనే ఆగిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు
- చివరిసారిగా 2013లో ఎన్నికలు.. 2018తో ముగిసిన పదవీకాలం
- జిల్లాలో మిగిలినవి 13 సొసైటీలు.. పనిచేస్తున్నవి ఆరు..
- ఇప్పటికే ఇతర సహకార సంఘాలకు ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

చేనేత కార్మికులకు ఉపాధిని ఇస్తూ పరిశ్రమ అభివృద్ధికి వారధిగా నిలుస్తున్న చేనేత సహకార సంఘాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శలు ఉన్నాయి. చేనేత జౌళిరంగాల్లో ఉన్న సొసైటీల ఎన్నికలగడువు ముగిసి ఆరేండ్లు దాటిపోయినా పర్సన్ ఇన్‌చార్జిలతోనే సుదీర్ఘకాలం వెల్లదీస్తున్నారు. గత సంవత్సరం జూన్‌లో చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు కాస్త హడావిడి చేయడంతో కార్మికులు ఎన్నికలు జరుగుతాయని భావించారు. ఏర్పాట్ల వరకు వెళ్లి సంవత్సరం దగ్గర పడుతున్నా ఎన్నికల ఊసే మరిచారు. ఎట్టకేలకు ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలు పెట్టినా ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. పాలకవర్గాల గడువు ముగిసి ఆరేండ్లు దాటినా పర్సన్ ఇన్‌చార్జిల కాలమే పొడిగిస్తున్నారు. గత సంవత్సరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అన్ని సహకార సంఘాల కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర సహకారసంఘాల ఎన్నికల అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో చేనేత సహకార సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఐదేండ్లకొకసారి నిర్వహించాల్సిన చేనేత సహకారసంఘాల ఎన్నికలు 2013లో చివరిసారిగా నిర్వహించారు. వీరి పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. ఆ సమయంలోనే ఎన్నికలు నిర్వహించాలని 40రోజుల ముందే నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చేనేత కార్మికులతో ఓటు హక్కు అర్హత కలిగిన జాబితాను జౌళిశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గత సంవత్సరం మరోసారి ఎన్నికల నిర్వహణకు జాబితాలు సిద్ధం చేసినా ఎన్నికల వైపు అడుగులు పడలేదు.

● ప్రశ్నార్థకంగా చేనేత సంఘాల ఉనికి..

చేనేత మగ్గం వారి జీవనాధారం. కంటి చూపు ఆనకపోయినా, వినికిడి జ్ఞానం కోల్పోతున్నా కాసేపు పనిచేస్తేనే ఒళ్లంతా నిస్సత్తువుగా మారుతున్న వృద్ధాప్యంలో చేనేత మగ్గాలపైనే ఉపాధి పొందుతున్నారు. యువకులు మరమగ్గాలవైపు వెళ్లడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేనేత మగ్గాలు లయ తప్పాయి. వేల సంఖ్యలో ఉన్న మగ్గాలు ఇప్పుడు వందల సంఖ్యలోకి చేరాయి. చేనేత సహకార సొసైటీలు మూలనపడ్డాయి. ప్రస్తుతం జిల్లాలో రికార్డుల ప్రకారం 13 సొసైటీలు ఉన్నారు. ఆరు సొసైటీలు మాత్రమే పనిచేస్తున్నాయి. చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు చేరాయి.

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 35 వేల మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తి జరుగుతుంది. 1984లో సిరిసిల్ల జిల్లాలో చేనేత మగ్గాలు ఆరువేల వరకు ఉండగా, ఇప్పుడు 204 మగ్గాలకు చేరుకున్నాయి. ఈ మగ్గాలపై 325 మంది కార్మికులు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేనేత అభయహస్తం పథకాలను అమలుచేస్తోంది. నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్నకు భరోసా పథకాలను అందిస్తున్నారు. నూలు సబ్సిడీని ఇస్తున్నారు. చేనేత కళను బతికించడానికి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం 2017లో చేనేత లక్ష్మీ పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధశాఖల ఉద్యోగులు 2,662 మంది పథకంలో చేరారు. చేనేతలక్ష్మీ పథకంలో చేరిన ఉద్యోగులు బట్టలు కొనుగోలు చేశారు. ఈ పథకం మళ్లీ కొనసాగలేదు. వేములవాడ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌గా గుర్తించింది. క్లస్టర్ కింద రూ.1.19 కోట్ల నిధులను మంజూరుచేసింది. దీనిలో భాగంగా రూ 50 లక్షలతో మౌలిక వసతుల కేంద్రం ఆధునిక డిజైన్‌తో కార్మికులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. మొదటి విడతలో రూ.19.10 లక్షలు విడుదల చేయగా 300మంది లబ్ధిదారులు కొత్త డిజైన్ల అభివృద్ధి, చేనేత శిక్షణను పొందారు. జిల్లాలో 175 మగ్గాలు ఉండగా అందులో కొన్ని వినియోగంలో లేవు. జిల్లాలో సిరిసిల్లలో 76మగ్గాలు, వేములవాడలో 4, వేములవాడ మండలంలో 7, చందుర్తిలో 8, బోయినపల్లిలో 27, తంగళ్లపల్లిలో 34, ఇల్లంతకుంటలో 4, గంభీరావుపేటలో 1, కోనరావుపేటలో 14 ఉన్నాయి. ఇందులో సిరిసిల్లలో మహేశ్వర సొసైటీ, సిరిసిల్ల సొసైటీ, జగదాంబ సొసైటీ, వేములవాడ, హన్మాజీపేట, మామిడిపెల్లి సొసైటీలతో పాటు ఖాదీగ్రామోద్యోగ, తంగళ్లపల్లి సొసైటీల్లో చేనేత మగ్గాలు కార్మికులకు ఉపాధిని అందిస్తున్నాయి. చేనేత కార్మికుడికి పదిహేను రోజుల పాటు కష్టపడితే రూ.500నుంచి రూ.800 వరకే కూలి లభిస్తోంది. చేనేత మగ్గాలకు కండెలు చుట్టే వృద్ధ మహిళలు ఒక నూలు లడి చుడితే రూ.6 నుంచి 10 రూపాయలు మాత్రమే లభిస్తాయి. పొద్దంతా చుడితే 50 రూపాయలు మాత్రమే గిట్టుబాటు అవుతుంది. చీరలోని గొప్పతనాన్ని చాటుతూ అగ్గిపెట్టెలో సైతం అమిరే చీర నేసి ప్రపంచాన్ని అబ్బుర పరిచిన సిరిసిల్ల చేనేత పరిశ్రమ ఉనికిని మాత్రం కొందరు యువకులు బతికించే ప్రయత్నం చేస్తున్నారు.

మరమగ్గాల కార్మికుల మానవహారం

- సిరిసిల్లలో నాలుగో రోజుకు చేరిన నిరవధిక సమ్మె



సిరిసిల్లలో మానవహారం నిర్వహిస్తున్న మరమగ్గాల కార్మికులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో మరమగ్గాలతో పాటు అనుబంధ రంగాల కార్మికుల కూలి నిర్ణయించి, సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజులగా నిరవధిక సమ్మెను చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని బీవైనగర్ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులు భారీ ర్యాలీగా తరలివచ్చి మానవహారం చేపట్టి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పవర్‌లూంవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్ దాస్ గణేష్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, నక్క దేవదాస్, ఎలిగేటి శ్రీనివాస్, ఒగ్గు గణేష్, జగదీష్, గుండు రమేష్, బెజుగం సురేష్, బాస శ్రీధర్, మచ్చవేణు, సబ్బని చంద్రకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట ఎస్జీటీ ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. 2008 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికై జీవోనెంబర్ 28 ద్వారా 2010లో ఉద్యోగంలో చేరలేకపోయిన ఉపాధ్యాయులు సుదీర్ఘ పోరాటం తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో ప్రభుత్వంతో కాంట్రాక్ట్ ఎస్జీటీ ఉపాధ్యాయులగా నియమించడంతో ఆ ఉపాధ్యాయుల కల 15 సంవత్సరాలకు నేరవేరింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ఎస్జీటీ ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు.

ప్రతీ పేద కుటుంబానికి రేషన్ కార్డు..

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డు జారీచేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ రేషన్ కార్డుల జారీపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన, మీ సేవా, ఇతర మార్గాల ద్వారా రేషన్ కార్డుల జారీ కోసం వచ్చిన 30వేల 977దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేశామన్నారు. రేషన్‌కార్డు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా తయారుచేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితాను కలెక్టర్‌లకు పంపారని, దరఖాస్తులను స్క్రూటినీ చేసి అర్హులైన వారితో ముసాయిదా జాబితా రూపొందించాలని, గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు తీసుకుని వాటిని పరిష్కరించి రేషన్ కార్డు జారీచేయాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధి కారి రాధాబాయి, డీసీఎస్‌వో. వసంతలక్ష్మి, అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ పరిధిలో 4 విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు

వేములవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి వేములవాడ నియోజకవర్గం పరిధిలో కొత్తగా నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయించినట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో 3కోట్ల 96 లక్షలతో, లింగంపేటలో 3కోట్ల 52లక్షలతో, కోనరావుపేట మండలం మరిమడ్లలో 2కోట్ల 78లక్షలతో 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్లు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు.

తెలుగు, హిందీ పండిట్‌లకు శిక్షణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తెలుగు, హిందీ పండిట్‌లకు శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నూతనంగా పదోన్నతి పొందిన అందరూ ఉపాధ్యాయులకు ఆర్పీలు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యా పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) జిల్లా అధ్యక్షులు గోనె బాల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం అంజయ్య, కార్యదర్శి చంద్రం, జిల్లా ఉపాధ్యక్షులు నేత రమేష్, అనుముల మల్లయ్య, నారా అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన

తంగళ్లపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలో మదీనా మసీద్ వద్ద ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ హమీద్, ఎండి హైదర్, ఎండి సలీం, ఎండి ఇమామ్, సర్దార్‌ఖాన్, మౌలానా, గౌసోద్దిన్, ఆసిఫ్, సలీం, జానీ, ఆరిఫ్, చాంద్‌మీయా పాల్గొన్నారు.

దేశ ప్రజలను విడగొట్టడానికి బీజేపీ కుట్రలు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



తిప్పాపూర్ పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రజలను విడగొట్టాలని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలోని 7,8వ వార్డుల్లో జైబాపు, జైభీమ్, జై సంవిదాన్ పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ పాదయాత్రను కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ గర్జన నిర్వహించామని, పలు పార్టీలు పాల్గొని మద్దతు తెలియజేయడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం తాడూరు, గోపాల్‌రావ్‌పల్లె, పాపయ్యపల్లె గ్రామాల్లో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నాగుల సత్యనారాయణగౌడ్ మాట్లడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కోఆర్డినేటర్ చిలుక రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, డైరెక్టర్లు ఆరెపల్లి బాలు, లింగాల భూపతి, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, జుపెల్లి రాజేశ్వర్‌రావు, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, మీరాల శ్రీనివాస్ యాదవ్, మునిగెల రాజు, చుక్క శేఖర్, ఎగుర్ల ప్రశాంత్, చెన్నవేణి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టడానికి వీలు లేదు

- ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు - రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టడానికి వీలు లేదని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, కుస్రం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాకు వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు ఉదయం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శించుకున్నారు. కలెక్టరేట్‌లో చైర్మన్‌తో పాటు సభ్యులను కలెక్టర్ స్వాగతించారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలుచేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం సంక్షేమ రంగంలో ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ పంచాయతీ రాజ్, రోడ్డు భవనాలు, ముఖ్య ప్రణాళిక అధికారి పరిధిలో ఎట్టి పరిస్థితుల్లో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టవద్దని, ఎక్కడైనా నిధులు దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లాలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 4,313 ఎకరాలకు సంబంధించి 6,029 మంది రైతులు పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా, 1,614 మంది రైతులకు 2,860 ఎకరాలను పంపిణీ జరిగిందన్నారు. పెండింగ్ ఆర్‌వోఎఫ్ఆర్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అర్హులైన ఎస్టీ రైతులందరికీ పట్టాలు అందాలని 10 రోజులలో సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించి చేపట్టిన పనులకు రూ.1.08 కోట్ల నిధులను మంజూరు కోసం సింగరేణికి రాసామని అధికారులు తెలుపగా, సంబంధిత వివరాలు అందిస్తే సింగరేణి సీఎండీతో మాట్లాడి నిధులు వెంటనే మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీఇచ్చారు. సబ్సిడీ కింద ప్రభుత్వం మంజూరుచేసే మొత్తం సద్వినియోగం జరిగి యూనిట్లకు గ్రౌండింగ్ అయ్యే విధంగా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సీఎంవో కార్యాలయంలో సిరిసిల్ల కలెక్టర్, జిల్లా అధికారులు బాగా పనిచేస్తున్నారని మంచి పేరు ఉందని, ఆ పేరు కాపాడుకోవాలని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అభినందనీయం..

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఎటువంటి మరణాలు లేకుండా మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న వైద్యబృందానికి కమిషన్ చైర్మన్ అభినందనలు తెలిపారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకుంటున్నారని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లలో విద్యార్థుల రక్షణకు, కుక్కలు, కోతుల సమస్య పరిష్కారం కోసం సోలార్ ప్యానల్ ఫెన్సింగ్ ఏర్పాటు ప్రతిపాదనలు 7రోజుల్లో సిద్ధం చేయాలని చైర్మన్ ఆదేశించారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా సన్మానించారు. ప్రజల నుండి వారి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారీ రాధాబాయి, డీఎస్పీ చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కావడంతో ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.50వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. బోయినపల్లికి చెందిన టేకు పద్మశంకర్ పూరి గుడిసె గురువారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, కలెక్టర్ పరామర్శించారు. అంతేకాకుండా బోయినపల్లి మాజీ సర్పంచ్ సంభ లక్ష్మీరాజం 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి మాజీ సర్పంచ్ స్థంబ లక్ష్మీరాజాం తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- ఐకేపీ ఏపీఎం మల్లేశం



కొనుగోలు కేంద్రం కల్లాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం మల్లేశం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఐకేపీ సెర్ప్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగద్దని ఏపీఎం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాల కల్లాలను సీసీలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 26 ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు గ్రామ వీవోఏలు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సీసీలకు, వీవోఏలకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కావేరి మండల సమ్మైక్య కార్యాలయంలో శ్రీనిధి రీజినల్ మేనేజర్ భూకైలేష్ సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్‌కు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రమాద బీమా, లోన్ ఇవ్వడం అంశాలపై అప్లోడ్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ బాబు, సీసీలు పాల్గొన్నారు.

వివాహితను బలి తీసుకున్న సోషల్ మీడియా

- వ్యక్తిగత వీడియోను పోస్టు చేసిన యువకుడు
- అవమానంతో ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వ్యక్తిగత వీడియో వైరల్ అయిందనే మనస్థాపంతో జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(23) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలి ఇంటి సమీపంలో ఉండే హుస్సేన్ అనే వ్యక్తి ఆమె వ్యక్తిగత వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో మనస్థాపం చెందిన వివాహిత ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం కూతురు చూసి పక్కింటి వాళ్లకు తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు. తన మృతికి హుస్సేన్ అనే వ్యక్తి కారణమంటూ ఆత్మహత్యకు ముందు హిందీలో సూసైడ్‌నోట్ రాసింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతురాలి భర్త రెండు సంవత్సరాలక్రితం ఉపాధికోసం దుబాయివెళ్లాడు. మృతురాలికి కొడుకు(4), కూతురు(2) ఉన్నారు.

డిగ్రీ విద్యార్థి బలవన్మరణం

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌లో చింతకుంట దుర్గాప్రసాద్(22) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... దుర్గాప్రసాద్ ఇంట్లో అందరు నిద్రిస్తుండగా తెల్లవారు జామున ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న దుర్గాప్రసాద్ పోలీస్ కానిస్టేబుల్, తదితర పోటీ పరీక్షలకు హాజరైనప్పటికీ ఏ ఉద్యోగం రాలేదని మనస్థాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి చింతకుంట శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ముస్తాబాద్(గంభీరావుపేట), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామానికి చెందిన పాతూరి మల్లవ్వ(54) అనే మహిళ శుక్రవారం అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడింది. మల్లవ్వ గర్భకోశ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతోంది. గతంలో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో మల్లవ్వకు ఆపరేషన్ కూడా అయ్యింది. అయినా వ్యాధినయం కాలేదు. తన అనారోగ్య సమస్యను తలచుకుంటూ మల్లవ్వ బాధపడేది. శుక్రవారం తన భర్తతో కలిసి మల్లవ్వ పొలం వద్దకు వెళ్లింది. భర్త రాంరెడ్డి పాడి గేదలకు మేత వేసేందుకు వెళ్లగా మల్లవ్వ అక్కడే ఉన్నచెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతురాలు భర్త రాంరెడ్డి ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గణేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓగుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి వయస్సు 20-25 మధ్యలో ఉంటుందని, ఆంధ్రకు చెందిన దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

ముస్తాబాద్(గంభీరావుపేట), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో కోతుల దాడిలో ఓవృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరింది. కట్కూరి బాలవ్వ అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద ఉండగా, కోతులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ బాలవ్వను బంధువులు ఓ ప్రైవేటుఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు.

సిరిసిల్ల నేతన్నల ప్రతిభ



నేసిన బంగారు చీరతో నల్ల విజయ్

సిరిసిల్ల ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కళాకారులు యెల్ది హరిప్రసాద్, నల్ల విజయ్‌లు తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మరమగ్గాలపై తమ కళా నైపుణ్యంతో అద్భుతంగా చీరలను తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 6న జరిగే భద్రాద్రి సీతారాముల కల్యాణానికి బంగారు పట్టుచీరను హరిప్రసాద్ సిద్ధం నేశారు. అలాగే నల్ల విజయ్ పువ్వుల డిజైన్‌తో కూడిన బంగారు చీరను నేశారు. ఈ ఇద్దరి కళాకారుల ప్రతిభను చూసి పలువురు అభినందిస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి బంగారు పట్టుచీర..

సీతారాముల కల్యాణం జనులందరూ ఎంతో సంబురంగా జరుపుకుంటారు. అందులో ముఖ్యంగా భద్రాదిలో జరిగే వేడుకలకు తరలివెళ్తారు. ఆ రాముడికి మరోసారి సిరిసిల్ల నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ మరో అద్భుతమైన బంగారు వర్ణంతో పట్టు చీరను సిద్ధం చేశాడు. ఈనెల 6న భద్రాది దేవాలయంలో జరిగే సీతారాముల కల్యాణపు వేడుకలకు అందించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విభిన్నమైన చీరలను తయారుచేస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన హరిప్రసాద్ 5.50 మీటర్లు 800 గ్రాముల బరువు గల చీరలో వన్ గ్రామ్ గోల్డ్ జరీని ఉపయోగించి చేనేత మగ్గంపై చీరను నేశారు. చీరపై సీతారాములు, లక్ష్మణుడు, ప్రతి రూపా లను నేశాడు. ఆరు రోజుల పాటు శ్రమించి తయారు చేసిన ఈ చీర కొంగుపై భద్రాది ఆలయ మూలవిరాట్ దేవతామూర్తులను నేశారు. చీర బోర్డర్‌లో శంఖు, చక్రనామాలు, హనుమంతుడు, గరుత్మంతుల ప్రతిరూపాలు నేశా డు. చీరలో శ్రీరామ, శ్రీరామ రామేతి రమే రామే మనోరమే, సహస్ర నామతాత్యుల్యం అనే శ్లోకాన్ని వచ్చే విధంగా 51సార్లు పొందు పర్చారు. అద్భుతంగా తయారైన చీరను కల్యాణం సందర్భంగా అందించనున్నారు. రెండు సంవత్సరాలుగా సీతారామ కల్యాణం సందర్భంగా చీరలను నేసి అందిస్తున్నారు.





చేనేత మగ్గంపై చీరను నేస్తున్న నేత కళాకారుడు హరిప్రసాద్, చీరపై సీతారాముల ప్రతిరూపం

ఆకర్షణీయంగా బంగారు చీర..

సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్ చేనేత మగ్గంపై అబ్బురపరిచే చీరలను నేస్తున్నాడు. తాజాగా పువ్వుల డిజైన్‌తో బంగారాన్ని ఉపయోగించి ఆకర్షణీయంగా చేనేత మగ్గంపై చీరను నేశాడు. బళ్లారికి చెందిన ఓ వ్యాపారవేత్త తన కుమార్తె కోసం 20 గ్రాముల బంగారాన్ని ఉపయోగించి చీరను నేయాలని విజయ్‌కు ఆర్డర్ ఇచ్చాడు. చీరపై బంగారు వర్ణంతో పువ్వులు పూసినట్లుగా నేశాడు. 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో 800 గ్రాములు ఉన్న ఈ చీరను పది రోజులు శ్రమించి నేశాడు. గతంలో 200 గ్రాములు బంగారంతో చీరను నేశాడు. వెండి ని ఉపయోగించి రంగులు మార్చే చీరను, 222 రంగులతో పరిమళించే పట్టు చీరను తయారు చేశాడు.

హోటళ్లపై సివిల్ సప్లయిస్ అధికారుల దాడులు

- 102 గ్యాస్ సిలిండర్లు పట్టివేత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్‌సప్లై అధికారి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సివిల్ సప్లై అధికారులు శుక్రవారం నగరంలోని పలు టిఫిన్‌సెంటర్లు, హోస్టళ్లలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 102 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ గృహవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్‌సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగించడం నేరమన్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈదాడుల్లో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బుచ్చిబాబు, డీటీసీఎస్ ఖాజా మోయినోద్దీన్, వసంత్‌రావు, సురేందర్, ఉష, ఎఫ్ఐఎస్ అన్వర్, వినోద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను శిక్షించాలి

ఎలిగేడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసిన సాయికుమార్‌ని దారుణంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నిజనిర్ధారణ బృందం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ సాయికుమార్ అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయి రెండేళ్లుగా ప్రేమించుకున్నారన్నారు. వీరి ప్రేమను సహించని అమ్మాయి తండ్రి సదయ్య మార్చి 27న సాయికుమార్‌ను హత్యచేశాడని పేర్కొన్నారు. కుల అసమానతల నిర్మూలన పోరాటసమితి, సాయిత్రిబాయిపూలే మహిళాసంఘం వారు హత్యను ఖండించారు. హత్యకు ప్రధాన సూత్రధారులైన సిద్ధి సారయ్య, చీకటి హరీష్‌గౌడ్, చీకటి మల్లయ్యగౌడ్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజనిర్ధారణ బృందం రాష్ట్రప్రధాన కార్యదర్శి కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జె.చక్రవర్తి, రాష్ట్ర సావిత్రిబాయిపూలే మహిళ సంఘం అధ్యక్షురాలు గన్నారపు సరోజన, చైతన్య భారతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవిందు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర మోహనక్రిష్ణ, రాష్ట్ర నాయకుడు ఆరేపల్లి క్రాంతికిరణ్, రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సభ్యుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎర్రవెల్లి రమేష్, రాములు

కోనరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికిచెందిన ఇద్దరు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఇద్దరు నీరటి రామయ్య, ఎర్రవెల్లి రమేష్‌లు గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్ళింది. బాధితులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాజీవ్ రహదారిపై ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం



గౌస్, ఇమ్రాన్(ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రామగుండం కేజీఎన్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో నివాసం ఉండే మహ్మద్ గౌస్ అలియాస్ నిస్సార్(34) అనేయువకుడు ఎన్టీపీసీలోని ఒక జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అతడి స్నేహితుడు మహబూబ్ బస్తీకిచెందిన షేక్ఇమ్రాన్ (28) తోకలసి కారులో హైదరాబాద్‌వెళ్ళారు. అనంతరం హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి రామగుండానికి తిరుగు ప్రయాణంఅయ్యారు. కారును మహ్మద్‌గౌస్ నడుపుతున్నాడు. సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో చేరుకునే సరికి శుక్రవారం తెల్లవారుజామున రాజీవ్ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొన్నారు. కారులో ఉన్న ఇద్దరిలో ఇమ్రాన్ అక్కడికక్కడే చనిపోగా, తీవ్ర గాయాలైన గౌస్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మరోగంటలో రామగుండం చేరుతారనగా ప్రమాదం జరగడం, ఇద్దరు చనిపోవడం వారి వారి కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో మహ్మద్ గౌస్‌కు నాలుగేళ్ల క్రితమే వివాహం కాగా భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇమ్రాన్ అవివాహితుడు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

రేషన్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన చింతల శివరాజు ట్రాలీ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీచేయగా సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్లచెరువు గ్రామం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకు న్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం పొత్తూరు గ్రామసమీపంలోని బిక్కవేలు నుంచి పెద్దలింగాపూర్ గ్రామానికి ఇసుక తరలిస్తామని రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సమా చారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న కరీం నగర్ జిల్లా ఖాజీపూర్ గ్రామానికి చెందిన అనుగొండ మధుపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇంటి పై కప్పు ధ్వంసం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్న పేట గ్రామానికిచెందిన బాలసాని నిర్మల-సమ్మయ్య ఇంట్లో శుక్రవారం సిలిండర్ పేలి ఇంటి పైకప్పు ధ్వంసమైంది. బాధితుల కథనం మేరకు ఇంట్లో వినియోగిస్తున్న సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఇంటి రేకులు ధ్వంసం అయ్యాయి. సిలిండర్ ప్రమాదంలో ఇంటి పైకప్పు రేకులు పగలడంతో పాటు, విద్యుత్ మీటర్, వంట సామగ్రి దెబ్బతినడంతో ఆర్థికంగా నష్టపోయామన్నారు. గ్యాస్ సంస్థ ఆదుకోవాలని బాధితులు కోరారు. సంఘటన స్థలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

'ఉపాధి' పనులపై కూలీల ఆసక్తి



రామడుగులో పనులు చేస్తున్న కూలీలు

రామడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా కూలీలు పనులు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతిరోజు మండలంలో వివిధ గ్రామాల్లో 1200మంది వరకు ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచినరేట్లతో రోజుకు ఒక్కోకూలీకి 300రూపాయల వరకు చెల్లిస్తోంది. ఇందిరమ్మ ఆత్మీయభరోసా కార్యక్రమంలో భాగంగా భూమిలేని నిరుపేదలకు 12 వేల రూపాయలు అందిస్తుండడంతో కూలీలు తమకు కేటాయించిన పనిదినాలను చేపట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సంవత్సరానికి కనీసం 20 రోజులు పని చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకం వరిస్తుంది. ఈ నేపథ్యంలో పనుల్లో పాల్గొనేందుకు పలువురు ముందుకువస్తున్నారు. మండలంలోని గుండి, గోపాల్‌రావుపేట, రామడుగు, వెదిర, కోరటపల్లి, దత్తోజిపేట, వెలిచాలతోపాటు అన్ని గ్రామాల్లో నీటికుంటలు, ఫార్మేషన్ రోడ్స్, డైవర్షన్ డ్రైన్స్, ఎస్సీ, ఎస్టీ స్మాల్, మార్జినల్ ఫార్మర్స్ ల్యాండ్ డెవలప్‌మెంట్ వర్క్స్ చేపడుతున్నారు. మండలంలో 8,582 జాబ్‌కార్డులు ఉండగా 3,506 మంది పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలో 1,97,500 పనిదినాలు కల్పించినట్లు ఏపీవో రాధ తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తికి ఏడాది జైలు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా వాహనం నడిపి 12 గొర్రెల మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా, బాధితుడికి లక్షరూపాయల పరిహారం చెల్లించాలంటూ జగిత్యాల కోర్టు రెండవ అదనపుజ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కసాదిచంద్రయ్య అనేవ్యక్తి గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. 2017 ఫిబ్రవరి 14న తన గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సంతోష్ అనేవ్యక్తి వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ గొర్రెల మందను ఢీ కొట్టాడు. దీంతో సంఘటన స్థలంలో 12 గొర్రెలు మృతి చెందగా మరికొన్ని గాయపడ్డాయి, బాధతుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రణధీర్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటి అధికారి సురేష్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సంతోష్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఎక్కువ నీడనిచ్చే మొక్కలను పెంచాలి

- రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా



మహాత్మానగర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా

తిమ్మాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ నీడను ఇచ్చే మొక్కల రకాలను, పండ్లమొక్కలను ఎక్కువగా పెంచాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన దశబ్ధి సంపదవనాలు ప్లాంటేషన్‌ను సందర్శించారు. అందులో పెంచుతున్న మొక్కలు, పండ్లమొక్కలరకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీకి అదనపు ఆదాయాన్ని ఇచ్చే మొక్కలను పెంచినందుకు క్షేత్రస్థాయి సిబ్బందినిఆయన అభినందించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన సందర్శించి నర్సరీలో పెంచుతున్న మొక్కలపై అడిగి తెలుసుకున్నారు. సంపదవనంలో ఓ మొక్కను నాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో స్టేట్ ప్లాంటేషన్ మేనేజర్ నర్సింగరావు, డీఆర్డీవో వి శ్రీధర్, ఏపీడీ పి క్రిష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టీపీసీలో రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి..
- మరొకరికి తీవ్రగాయాలు

జ్యోతినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ సమీప రాజీవ్ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దీకొండ అభిరామ్(18) అనే యువకుడు మృతిచెందాడు. పెద్దూరి అభిరామ్(17) అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాలలో ఒక మాల్‌లో సెల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్న దీకొండ అభిరాం తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం కరీంనగర్‌లో వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్‌టీపీసీ బి.పావరాజు గడ్డ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన దీకొండ అభిరామ్ అక్కడిక్కడే మృతిచెందగా పెద్దూరి అభిరామ్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి మేనమామ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీపీసీ ఎస్ఐ మానస తెలిపారు.

గంభీరావుపేటలో తాగునీటి కటకట

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని 8, 9, 10వ వార్డులలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ కాలనీవాసులు శుక్రవారం నిరసన చేపట్టారు. మహిళలు ఖాళీ బిందెలను ప్రధాన రహదారిపై పెట్టి తాగునీటి ఎద్దడి తీవ్రతను తెలిపారు. ఉన్న బోరులో నీరు తగ్గడంతో సరిపడా నీరు రావడం లేదని, మిషన్ భగీరథ పైపులైన్ వేసి సంవత్సరాలు గడుస్తున్నా నీరు రావడం లేదని వాపోయారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని, మురికి కాలువలు కూడా సరిగ్గా తీయక దోమలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలపడంతో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేశారు.

పింఛను డబ్బులు కాజేశాడనే ఆవేదనతో వృద్ధుడి మృతి



లక్ష్మణ్(ఫైల్)

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు కాజేశాడనే ఆవేదనతో జగిత్యాల జిల్లాకేంద్రంలోని గాంధీ నగర్‌కు చెందిన నక్క లక్ష్మణ్(66) అనే వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. నక్క లక్ష్మణ్ ఎస్సారెస్పీలో అటెండర్‌గా విధులు నిర్వహించి 2011లో పదవీ విరమణ పొందాడు. అప్పటి నుంచి 2018 సంవత్సరం వరకు ప్రతి నెల వస్తున్న రూ.20వేల పింఛన్‌తో మతిస్థిమితం లేని ఇద్దరు కూతుళ్లతో పాటు భార్యను పోషిస్తున్నాడు. లక్ష్మణ్ ప్రతినెల పింఛన్ డబ్బులను బ్యాంకు నుంచి డ్రా చేసేందుకు ఇంటిపక్కనే ఉన్న తిరుపతి అనే యువకుడు సహాయ పడుతుండేవాడు. లక్ష్మణ్‌కు సంబంధించిన ఖాతాకు సైతం తిరుపతి తన ఫోన్ నంబరును లింకు చేయించుకున్నాడు. అయితే 2018 తర్వాత పింఛన్ రూ.46వేలకు పెరడగంతో దీన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు ఎప్పటిలాగే వృద్ధుడికి రూ.20వేలు ఇస్తూ మిగిలిన డబ్బును తన సొంతానికి వాడుకున్నాడు. ఇలా మొత్తం రూ.18లక్షలను సొంతానికి వాడుకున్నాడు. అయితే పింఛన్ పెరిగిందని తెలుసుకున్న బాధితుడు తన బంధువుల సహాయంతో బ్యాంకుకు వెళ్లగా ఏడు సంవత్సరాల నుంచి రూ.46వేలు వస్తున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు ప్రజావాణిలో కలెక్టర్‌కు మొర పెట్టుకోవడంతో పోలీసులు మోసం చేసిన యువకుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. రూ.18లక్షలు మోసపోయానని వృద్ధుడు నెల రోజులుగా తీవ్రమనోవేదనకు గురై శుక్రవారం మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ శివారు ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతుడి వయస్సు 40-45 మధ్య ఉంటుందని, పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం ఉందని, జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు ఎస్ఐ నెంబర్ 8712656509 కు సంప్రదించాలని తెలిపారు.

బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ

పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు


రామోజీపేటలో మాట్లాడుతున్న వీహెచ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీయే అని మాజీ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు హన్మంతరావు పేర్కొన్నారు. మండలంలోని రామోజిపేట గ్రామంలోని శ్రీసీతారామాశ్రమంలో శుక్రవారం వీహెచ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేపట్టారని, కాంగ్రెస్ పార్టీ అంటేనే నిరుపేదల పార్టీ అని అన్నారు. అనేక సంవత్సరాలుగా వెనకబడిన ప్రజలను గుర్తించి, సరైన అవకాశాలు కల్పించాలని రాష్ట్రంలో కులగణన చేపట్టామన్నారు. కులగణన ద్వారానే ఎంతశాతం జనాభా వెనుకబడిన వర్గాల ప్రజలు ఉన్నారో తెలిసిపోయిందన్నారు.

దీనిని కూడా కొంతమంది విమర్శలు చేసి ప్రజల్లో చులకన అయ్యారన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే అన్ని రాష్ట్రాలలో తాను తిరిగి ఏకం చేస్తానన్నారు. బీజేపీ అధికారం కోసమే మత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రామోజిపేట ఆలయానికి అనేక సంవత్సరాల నుంచి వస్తుంటానని తెలిపారు. శ్రీరాముడి ఆలోచన విధానం ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. సమావేశంలో పీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, పీసీసీ నాయకుడు గంప గంప మహేందర్, సిరిసిల్ల పద్మశాలి సంఘ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఏఎమ్‌సీ డైరెక్టర్ కేతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది తర్వాత ప్రత్యేక కోర్సులు

ఇంటర్‌తోపాటు వొకేషనల్, డిప్లొమా కోర్సులు



చొప్పదండి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. తర్వాత ఏ కోర్సులు చేయాలనేది విద్యార్థులకు సంశయం ఏర్పడుతుంది. ఇంటర్మీడియట్ వైపు అందరిచూపు ఉంటుంది. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులను విద్యార్థులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇంటర్‌తోపాటు పాలిటెక్నిక్, ఐటీఐ, డిప్లమా, వొకేషనల్ లాంటి అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ కోర్సుల వివరాల విద్యార్థుల కోసం.

• ఇంటర్..

ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, గురుకులాల్లో ఉన్నాయి.

• ఐటీఐ..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఫిట్టర్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, వైర్‌మెన్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనర్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫుడ్ ప్రొడక్షన్, వెల్డర్, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

• పారామెడికల్..

డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ), డిప్లొమా ఇన్ హాస్పిటల్ ఫుడ్ సర్వీస్ మేనేజ్‌మెంట్, డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, ఏఎన్‌ఎం కోర్సులు ఉన్నాయి.

• ఇంజనీరింగ్..

ట్రిపుల్ ఐటీ, ఐఎంఈ, ఐఈటీ ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

• పాలిటెక్నిక్...

కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్, అగ్రికల్చర్, టెక్నికల్ కెమికల్, సిరమిక్ టెక్నాలజీ, హార్టికల్చర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఐటీ, తదితర పాలిటెక్నిక్ కోర్సులు ఉన్నాయి.

• ఎన్‌టీటీఐ..

నేషనల్ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ఇన్ టూల్ అండ్ డై మేకింగ్, టెక్నికల్ స్కిల్స్, ఎలక్ట్రానిక్స్, మెకట్రానిక్స్, ఫ్యాషన్ డిజైనింగ్, ప్లాంట్ ఇంజనీరింగ్, మానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ.

• డిప్లొమా కోర్సులు...

హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం, అకౌంటెన్సీ, ఇండస్ట్రీస్, పర్సనల్ మేనేజ్‌మెంట్, లెదర్ టెక్నాలజీ, మ్యూజిక్, డ్యాన్స్.

• వొకేషనల్ కోర్సులు..

29 రకాల వృత్తి విద్యా కోర్సులను ఇంటర్ బోర్డు నిర్వహి స్తున్నది. కొన్ని కోర్సులను పూర్తి చేసిన తర్వాత ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సెట్ రాసుకోవచ్చు. డిగ్రీ కోర్సుల్లో కూడా చేరవచ్చు.

• సర్టిఫికెట్ కోర్సులు..

డీటీపీ, టాలీ, గ్రాఫిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఈ కోర్సులలో కొన్నింటికి ప్రవేశపరీక్ష ద్వారా కళాశాలల్లో చేరే అవకాశం ఉండగా, మిగతా కోర్సులు చదివేందుకు విద్యార్థులకు మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.



ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి

ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫి ఉల్లా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మార్గా లతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించు కొని అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కమిషనర్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫి ఉల్లా గ్రామీణ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బ్యాంకు కాలనీలో గల వోల్కసి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా ఇస్తున్న ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన కార్యక్ర మాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన గ్రామీణ యువతీయువకులకు ఇస్తారని, దీన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వోల్కసి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మోతిలాల్ భార్గవ్, సెంటర్ మేనేజర్ మమత, ఈజీఎంఎం ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి, రవీందర్, శిక్షకులు అనిల్, రాములు, గాజు శ్రీనివాస్, మధుకర్, జ్యోతి, స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలూ.. రారండి..

• చిన్నారుల కోసం ప్రత్యేక గ్రంథాలయం • వేసవిలో అందుబాటులో పిల్లల పుస్తకాలు


కరీంనగర్ గ్రంథాలయంలో బాలల గ్రంథాలయ విభాగం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 4: వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలు, ఆటలకే పరిమితం కాకుండా వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక బాలల గంథాలయం ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన బాలల గ్రంథాలయంలో పిల్లలకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఇందులో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు ఉపయోగపడే కథలు, నాటికలు, బొమ్మలు, డ్రాయింగ్, పెయింటింగ్స్, పిల్లల వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయి. పుస్తకాలతో పాటు ఆటలకు కూడా బాలల గ్రంథాలయం నిలయంగా మారింది. చెస్, క్యారం, లూడో, చైనీ చక్కర్ వంటి ఆటలు ఆడుకోవచ్చు. వీటికి ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఒక వేళ నచ్చిన పుస్తకం ఇంటికి తీసుకొని వెళ్లి తిరిగి గ్రంథాలయంలో ఇవ్వాలనుకుంటే ఒక ఫొటో, ఆధార్‌కార్డ్, సంబంధిత స్వల్ప రుసుము చెల్లించి రెండు వారాల్లో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. వేసవిలో వార్షిక పరీక్షల అనంతరం ప్రతి రోజూ ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలల గ్రంథాలయం సేవలందించనుంది. ప్రతి శుక్రవారంతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో బాలల గ్రంథాలయం అందుబాటులో ఉండదు. 8 నుంచి 10వ తరగతి ఆపై స్థాయి పిల్లలు కేంద్ర గ్రంథాలయంలో చదువుకోవచ్చు.

పిల్లల కోసం మరిన్ని పుస్తకాలు తెప్పిస్తాం

సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



చిన్నారుల అభిరుచిని బట్టి మరిన్ని విజ్ఞాన, వికాస, చరిత్రాత్మక, కథలు, బొమ్మల పుస్తకాలు తీసుకరావడానికి గ్రంథాలయ సంస్థ సిద్ధంగా ఉంది. బాలల గ్రంథాలయానికి ప్రత్యేక విభాగం ఉంది. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉంది. దీన్ని సద్వినియోగం చేసుకొని భావి భరత పౌరులుగా ఎదగాలని మా ఆకాంక్ష. విద్యార్థులకు గ్రంథాలయం ఆహ్వానం పలుకుతోంది.


బాలల గ్రంథాలయంలో ఆడుకుంటున్న చిన్నారులు (ఫైల్)

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

• కొనసాగుతున్న శ్రీరామనవమి వేడుకలు
• రాజన్నను దర్శించుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు
• రాజన్న సేవలో శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతి


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చి ఆలయ వసతిగృహాల్లో విడిది చేశారు. ఉదయం ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని స్వామి వారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని గండా దీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు.

కొనసాగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీసమేత అనంత పద్మనాభ స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా మహాభిషేక పూజ, పార్వతి రాజరాజేశ్వర స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ యాగశాల ప్రవేశం, మూలమంత్ర హవనం రాత్రి ప్రదోశ కాల పూజ, గ్రామసేవ కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు.

రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌లకు ఆలయ సంప్రదాయం ప్రకారంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాజన్న సేవలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో వినోద్ రెడ్డి శేషవస్త్రం కప్పి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట తహసీల్దార్ విజయ్ ప్రకాశ్‌రావు, సీఐ వీరప్రసాద్, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్, నర్సయ్య, నరేందర్ ఉన్నారు. అలాగే శృంగేరి విరూపాక్షమఠం పీఠాధిపతి విద్యా నృసింహ భారతిస్వామి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవోపేతంగా రాములోరి కల్యాణం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్స వాన్ని వైభవోపేతంగా నిర్వహించాలని ఈవో వినోద్‌రెడ్డి ఉద్యోగులను ఆదేశించారు. ఆలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉద్యోగు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సీతా రామచంద్ర స్వామివారి కల్యాణానికి భారీగా భక్తులు తరలివస్తారని, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్యాణానికి వచ్చే భక్తులకు తాగునీటి సరఫరా, క్యూలైన్ ఏర్పాట్లు, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగు దొడ్లు, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటలకు కల్యాణతంతు ప్రారంభమవుతుందని, అనంతరం పూర్ణహతి, సాయంత్రం రథోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఈ, డీఈ, ఏఈఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి..

రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కళ్యాణం ఏర్పాట్లును ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసు సిబ్బంది ఏర్పాటుచేయాలని సీఐ వీరప్రసాద్‌కు సూచించారు. తొక్కిసలాటలు జరగకుండా భక్తులను దృష్టిలో పెట్టుకుని బారికేడ్లు సహాయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వెంట సీఐ వీరప్రసాద్, ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణరావు, ఏఈవో అశోక్‌కుమార్ ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలి

చందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎన్సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్ అన్నారు. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ సత్యేంద్రనాథ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆధ్వర్యంలో ఎన్సీడీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం తనిఖీ చేసి, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సరు, ఓరల్ క్యాన్సరు, గర్భాశయ క్యాన్సర్లు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, 100శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, సీహెచ్‌వోలు సత్యనారాయణ, బాలచంద్రం, చందుర్తి వైద్యాధికారి డాక్టర్ వేదాచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలి

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
● చిన్న హనుమాన్ జయంత్యుత్సవాలపై సమీక్ష


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్పీ అశోక్‌కుమార్

మల్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ అశోక్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, వివిధ శాఖల అధికారులతో కొండగట్టు దేవస్థానం కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సమన్వయంతో పని చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ భక్తులు వచ్చేదారుల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పార్కింగ్ తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేములవాడ, జగిత్యాల నుంచి కొండగట్టుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

●భారీ బందోబస్తు: ఎస్పీ అశోక్‌కుమార్

హనుమాన్ చిన్న జయంతికి వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెయ్యి మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి వంద సీసీ కెమెరాలతో కొండంతా పర్యవేక్షణ చేస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు మఫ్టీ, సీసీఎస్ పోలీసులు అందుబాటులో ఉంటార న్నారు. శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

మానసాదేవి ఆలయానికి భక్తుల తాకిడి

- ఆది, మంగళ, శుక్రవారాల్లో విపరీతమైన రద్దీ
- భక్తులతో కిక్కిరిసిపోతున్న ఆర్టీసీ బస్సులు
- అదనపు బస్సులు నడపాలని వేడుకోలు
- స్పందించని అధికారులు


ఖాసీంపేటలో బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

గన్నేరువరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేటలో స్వయంభుగా వెలసిన మానసాదేవి, అపురూపలక్ష్మి అమ్మ వార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తుల తాకిడి విపరీతంగా ఉంటోంది. ఆంధ్రపదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం చేపడుతున్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లో దర్శనం చేసుకునేందుకు ఇటీవల రేలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహణకు 15మందిని ఏర్పాటు చేసి వారికి 7500 నుంచి 15 వేల వరకు జీతాలను అందజేస్తున్నారు.

కరీంనగర్ నుంచి ఖాసింపేటకు వచ్చే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. 50 మంది ఎక్కాల్సిన బస్సుల్లో 150మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. బస్సులు సరిపడా లేక ఆలయానికి వచ్చిన భక్తులు గంటల తరబడి ఆలయం వద్ద, అటు కరీంనగర్ బస్టాండ్ వద్ద పడిగాపులుగాస్తున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలని ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛందసంఘాల సభ్యులు,కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించిన దాఖలాలు లేవు. మండలానికి రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడం, డ్రైవ ర్లకు సైతం గంటకుపైగా బస్సును నడపడం కత్తి మీద సాములా మారింది. ఇప్పటికైనా కరీంనగర్ ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి సరిపడా బస్సులు నడపాలని భక్తులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.


భక్తులతో కిక్కిరిసిన మానసాదేవి ఆలయం

నంబర్‌ప్లేట్ టాంపరింగ్ చేసిన 60 బైక్‌ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఒకటో ఠాణా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్‌ప్లేట్‌లు లేకుండా, నంబర్‌ప్లేట్‌లను టాంపరింగ్ చేసినట్లు గుర్తించిన 60 ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసు ఠాణాకు తరలించి జరిమానాను విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి వాహనదారుడు హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్‌ను తప్పని సరిగా అమర్చుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్ఐ ఇషాక్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డి నర్సయ్య(55) అనారోగ్యంతో మృతిచెందగా భౌతికకాయానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శుక్రవారం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసాను అందించారు. సీనియర్ నాయకుని మృతిపట్ల మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు వర్స కృష్ణహరి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేష్, నాయకులు రామ భీమేష్, ఇల్లేందుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మనవేణి సత్యం తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దయ్యాల రాంచరణ్, దోమకొండ వినయ్‌లు జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. క్రికెట్‌లో ప్రతిభకనబరుస్తున్న ఈ యువకులు అండర్ 16విభాగంలో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈనెల 7నుంచి బీహార్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఇల్లంతకుంట యువకులు జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంపై స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, సభ్యులు అభినందనలు తెలిపారు.

కమిషన్ చైర్మన్‌ను కలిసిన మాట్ల మధు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను శుక్రవారం సిరిసిల్లలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు.

స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలనను కొనసాగిస్తోందని, స్థానిక సమస్యలపై ఉద్యమాలను చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ హాల్‌లో శుక్రవారం జిల్లా బీజేపీ పదాధికారులకు జిల్లా పార్టీ దిశా నిర్దేశం సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రెడబోయిన గోపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌వీ సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను అమలుచేస్తామని హామీ ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 15నెలలు గడిచిన వాటిని అమలుచేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గ్రామస్థాయి నుంచి ఎండగట్టడానికి బీజేపీ నాయకులు ఉద్యమాన్ని చేపట్టాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల్లాలోని గ్రామ స్థాయి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వంపై చేపట్టే ఉద్యమ కార్యాచరణలను రూపొందించుకోవాలని కోరారు.రైతు, వ్యవసాయ కూలీలు, మహిళలు, నిరుద్యోగ, యువత, ఇలా అన్నివర్గాల ప్రజలు సమస్యలపై పోరాడాలని తీర్మానించి రాబోవు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగునా నిలదీసి ఒత్తిడి తెచ్చేలా ఆందోళనలు, నిరసనలు చేపట్టేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని చేపట్టడంతోపాటు 11న జ్యోతిబా పూలే జయంతి, 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, బీజేపీ రాష్ట్ర ఎస్సీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, కరీంనగర్‌పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొనేటి సాయిలు, కన్వీనర్‌లు సిరికొండ శ్రీనివాస్,కో-కన్వీర్‌లు సంతోష్, మల్లారెడ్డి, రాజు, నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్

ఉపాధిహామీ చట్టం నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంటి వేణు మాట్లాడుతూ జూన్ 12, 13 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు, దీంట్లో భాగంగా అన్ని గ్రామాల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో 10కోట్ల మంది పనిచేస్తున్న ఉపాధిహామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందన్నారు. కార్మికునికి రోజుకు వేతనం కేవలం రూ. 300 ఇస్తూ కనీస వేతనం అమలుచేయడం లేదని ఆరోపించారు. ఒక్కో కూలీకి రూ 800 చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు 15 రోజుల్లో వేతనం చెల్లించాలని ఉపాధిహామీ చట్టంలో ఉందని దానిని తుంగలో తొక్కి మూడు నెలల వరకు కూడా కూలీ ఇవ్వడం లేదని ఆరోపించారు. గుండెజబ్బుతో మృతిచెందిన ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన లింగయ్య కుటుంబానికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బచ్చుపెల్లి శంకర్, బర్ల శ్రీనివాస్, బాలరాజు, శంకర్, నందు, బాలమల్లు, రాజయ్య, సుదర్శన్, రాజలింగం, కమాలకర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, నర్సయ్య, లక్ష్మణ్, బాలరాజు, అనిల్, మహేశ్, రమేష్, అభిలాష్, బాలయ్యలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ విపరీతంగా పెరిగిందని, పిల్లలపై వీటి ప్రభావం ఎక్కువగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరు అప్రమత్తతతో ఉండాలని, కొత్త వ్యక్తులు ఎవరు ఫోన్ చేసినా వారికి వ్యక్తిగత విషయాలు చెప్పరాదని తెలిపారు. అదేవిధంగా పిల్లలకు రాత్రిపూట ఎక్కువ సమయం పెద్ద ఫోన్లు ఇవ్వరాదని సూచించారు. ప్రతీ ఒక్కరు హెల్ప్‌లైన్ 100ను వినియోగించుకోవాలని, అదేవిధంగా ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే 1930కు ఫోన్ చేయాలని తెలిపారు. యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అంజయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, కేరళ మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో విద్యా విధానంలో సమూల మార్పులు తెచ్చినట్లు పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

వీర్నపల్లి(ముస్తాబాద్), ఏప్రిల్ 4 : తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మహిళలకు సెంట్రల్ గవర్నమెంట్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్ ప్రోగ్రాం ద్వారా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు టీడీఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ మట్ట రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి టైలరింగ్‌లో మహిళలకు ఉచిత ట్రైనింగ్ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 18సంవత్సరాల నుంచి 40ఏళ్లలోపు వయసు, 7వ తరగతి విద్యార్హత కలిగిన మహిళలు అర్హులని క్యాంప్ ఇన్‌చార్జి సునీత అన్నారు. ట్రైనింగ్ పూర్తికాగానే సమర్థ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

108లో ప్రసవం..

వీర్నపల్లి(ముస్తాబాద్) ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో దవాఖానాకు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించిన సంఘటన ముస్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. అంబులెన్స్ ఈఎంటీ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన స్రవంతి(22) అనే గర్భిణికి శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. 108లో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ మహేష్ అంబు లెన్స్ డ్రైవర్ సహాయంతో ప్రసవం చేశారు. స్రవంతి మగ బిడ్డకు జన్మనివ్వగా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. మెరుగైన వైద్యం కోసం ఇద్దరినీ సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామ య్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్ర వారం తెల్లవారుజామున క్షుద్రపూజలు చేసిన ట్లు కలకలం సృష్టించింది. పాఠశాలలో పనిచే స్తున్న ఉపాధ్యాయులు శుక్రవారం తెల్లవారు జామున పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి మేకను బలి ఇస్తున్నట్లుగా గుర్తించిన ప్రజలు జిల్లా విద్యాధికారికి ఫిర్యాదుచేసినట్లు తెలిసిం ది. స్పందించిన డీఈవో విచారణ జరపాలని మండల విద్యాధికారి దూస రఘుపతిని ఆదేశించడంతో శుక్రవారం విచారణ జరిపారు.

రామాలయానికి చంద్రప్రభ వాహనం వితరణ

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట అతి పురాతన సీతారామచంద్రస్వామి దేవాలయానికి సాయబుగారి రేణుక-నాంపెల్లిగౌడ్ దంపతులు రూ.లక్షా 21వేల విలువగల చంద్రప్రభ వాహనాన్ని విరాళంగా అందజేశారు. చాలా కాలంగా రామాలయంలో ఉన్న చంద్రప్రభ వాహనం లోటు ఈ వాహనం వితరణతో తీరిందని ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్ తెలిపారు. రామాలయానికి చంద్రప్రభ వాహనాన్ని వితరణ చేసిన రేణుక-నాంపెల్లిగౌడ్ దంపతులకు ఆలయ కమిటీ తరపున నర్సాగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

దళితుడిని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో దళితుడిని అవమానించేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల సీనియర్ నాయకుడు మంద రాజు పేర్కొన్నారు. వెంట పసుల వెంకటి, పట్నం మహేందర్, రజనీ కాంత్, తడకపెల్లి భూమయ్య, అంజనేయులు, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎల్ఈడీ లైట్ల వితరణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌లో ఎల్ఈడీ లైట్లను కాంగ్రెస్ నాయకుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి శుక్రవారం వితరణ చేశారు. గురు ఆశ్రమం నుంచి పాటిమీది హనుమాన్ ఆలయం వరకు చీకటి గా ఉంటుందని భక్తులు పేర్కొనడంతో నవీన్‌రెడ్డి 7ఎల్ఈడీ లైట్లను వితరణ చేశారు.

వరి పంట ధ్వంసం

కోనరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులోని వరి పంటలను అడవి జంతువులు ధ్వంసం చేశాయి. ధర్మారం గ్రామానికి చెందిన మల్యాల సుమన్, మాదాసు లక్ష్మిరాజం రైతులకు చెందిన వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. సుమారు రెండు ఎకరాల వరి పంటను ధ్వంసం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత..

తంగళ్లపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామానికి చెందిన తెలుగు పండితుడు గుర్రం అంజయ్య రచించిన హంసనీతి శతకాన్ని తన గురువు విశ్రాంత ఉపాధ్యాయుడు తోట నర్సయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. శుక్రవారం తాడురు ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకు, 75మంది విద్యార్థులకు హంసనీతి శతకం పుస్తాకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూర రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి బస్‌స్టాండ్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సభ్యులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కోట సతీష్ కుమార్, సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ పయ్యావుల రామచంద్రం, బాధ్యులు నంది కిషన్, సద్ది లక్ష్మారెడ్డి, వంగల రవీందర్, చేపూరి రాజేశం, కొలనూరి శంకర్, రావుల మల్లారెడ్డి, రావుల ముత్యంరెడ్డి, పాటి దేవయ్య, గొర్రె మల్లేష్, పెంజర్ల దేవయ్య, పెంజర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ శివారులోని బాబాజీకాలనీకి చెందిన చల్ల శ్రీకాంత్‌కు రూ.22500, కొండపల్లి మౌనికకు రూ.25వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం వారికి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, నాయకులు బాలకృష్ణయ్య, యాదయ్య, రాజనర్సు, షాదుల్, మోఫిక్, ఉపేందర్, తిరుపతి, జైపాల్, ప్రసాద్, మధు, పరుశరాములు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు

చందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో అగ్గి తెగులు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య అన్నారు. చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో వరి పంట పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరిలో అగ్గి తెగులు ఉధృతిని గమనించి తగిన సూచనలు చేశారు.

గురుకులానికి ఎంపికైన కోళ్లమద్ది విద్యార్థులు

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోళ్లమద్ది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులు 5వ తరగతి గురుకు ప్రవేశాలకు ఎంపికయ్యారు. ఎంపికైన 15 మంది విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తోట్ల కుమార్, అధ్యాపకులు అభినందించారు.

కరీంనగర్ డెయిరీ చైర్మన్‌కు పరామర్శ

కోనరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ డైయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావును కోనరావుపేట మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ శుక్రవారం పరామర్శించారు. రాజేశ్వరరావు మోకాలికి శస్త్రచికిత్స చేయించుకోగా పరామర్శించారు.

జై బాపు , జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర

రుద్రంగి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను శుక్రవారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, తర్రె లింగం, దర్నా మల్లేశం, పల్లి గంగాధర్, స్వర్గం పరందాము, సూర యాదయ్య, దయ్యాల శ్రీనివాస్, దాసరి గంగరాజం, అక్కనిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతిపత్రం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను వట్టెంల మాజీ సర్పంచ్ విష్ణు శుక్రవారం వేములవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వట్టెంల గ్రామంలో దళితులకు కేటాయించిన 12ఎకరాల భూమికి మోకా చూపాలని, నమిలిగుండుపల్లిలో దళితులకు 4 ఎకరాల భూమి కేటాయించినప్పటికి పాసుబుక్కు ఇవ్వలేదని పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

బీజేపీ సంజీవని అందజేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ఆకుల వజ్రమ్మ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహాయంతో బీజేపీ సంజీవని ఆక్సిజన్ పరికరాన్ని శుక్రవారం స్థానిక నాయకులు అందజేశారు. దాసరి గణేష్, పిట్ల శ్రీశైలం, నంది నరేష్, కిరణ్ నాయక్, మధు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

వేములవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గ్రూపు విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం వేములవాడలో ఘనంగా జరిగాయి. పాఠశాలకు సంబంధించిన వివిధ బ్రాంచీల్లో యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ సందర్భంగా స్థానిక సీనియర్ వైద్యుడు డాక్టర్ కే మనోహర్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీ సన్నిధి వెంకటకృష్ణ, డైరెక్టర్ ఇప్పపూల వినోద్ పట్టాలు అందజేసి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల నిర్వాహకులు


జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులు

మెగా జాబ్‌మేళాలో 45 మంది విద్యార్థుల ఎంపిక

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 45మంది ఎంపికయ్యారు. మ్యాజిక్ బస్సు సౌజన్యంతో పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాలో మొత్తం 120మందికి పైగా హాజరయ్యారు. ఇందులో 45 మందిని సెలక్ట్ చేసి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, కంపెనీల ప్రతినిధులు సంపత్, రమేష్, నరేష్, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గరుడ సేవ, ప్రాతఃకాల అర్చనం, హోమం, కళ్యాణం, సాయంత్రం బలిహరణం, మహా పూర్ణహుతి కార్యక్రమాలను వేద పండితుల సమక్షంలో నిర్వహించారు. కళ్యాణానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి కళ్యాణ వేడుకలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు, ఏఎంసీ డైరెక్టర్లు కళ్యాణ వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు బుగ్గ వాసు శర్మ, వేద పండితులు రఘురామ శర్మ, నరహరి శర్మ, రవీందర్ శర్మ, రాము శర్మ, బుగ్గ శ్రీనివాస్ శర్మ, బుగ్గ ఆంజనేయులు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి..

- ముదిరాజ్ సంఘం నాయకుడు నీలం మధు


సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

ముస్తాబాద్ (గంభీరావుపేట) ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదుగుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటలని ముదిరాజ్ సంఘం నాయకులు నీలం మధు పిలుపునిచ్చారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళన సభకు మధు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు రాజకీయంగా, విద్యాపరంగా ఎదగాలని, ప్రతి ముదిరాజ్ బిడ్డను ఉన్నత చదువులు చదివించాలని, అప్పుడే అన్ని రంగాల్లో ముందుకు సాగుతామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించింది కాంగ్రెస్ ప్రభత్వమేనని, గతంలో తెలంగాణ ఇచ్చింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. ముదిరాజ్‌లకు దీర్ఘ కాలికంగా ఉన్న సమస్య బీసీ డి నుంచి బీసీ ఏకు మార్చడమేనన్నారు. ఇంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఈ అంశాన్ని విన్నవించామని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. రెండు మూడు రోజుల్లో తమ ప్రతినిధులతో కలిసి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మరోసారి కలుస్తామని, ఖచ్చితంగా బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి ముదిరాజ్‌లను మార్చే అంశాన్ని విన్నవిస్తామన్నారు. బీసీ డీ నుండి బీసీ ఏ లోకి ముదిరాజ్‌లను చేర్పించగానే హైదరాబాద్ నడిబొడ్డున 2లక్షల మందితో ముదిరాజ్‌ల కృతజ్ఞత సభను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్య అతిదిగా ఆహ్వానించి, ముదిరాజ్ జాతీ తరపున కృతజ్ఞతలు తెలుపుతామని పేర్కొన్నారు. మిడ్ మానేరులో మన వాట కోసం పోరాటం చేసి, రావల్సిన వాట సాధిస్తామని, బడ్జెట్‌లో మత్స్య కార్మికుల అబివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతామని వెల్లడించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్, రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పిట్టల రవీందర్, మండల అధ్యక్షుడు రాంగోపాల్, జిల్లా యూత్ అధ్యక్షుడు రాజు, జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మన్, మాజీ జడ్పీటీసీ కోడీ అంతయ్య, శంకర్, విఠల్ ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నాయకులు అంజనేయులు, రవి, రాజిరెడ్డి, దేవరాజుగౌడ్, రమేష్, శ్రీనివాస్, బాలయ్య, రాజం, లింగయ్య తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని గోపాల్‌రావుపల్లె, పాపయ్యపల్లె, తాడూరు తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీ జరిగింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, డైరెక్టర్లు ఆరెపల్లి బాలు, పొన్నాల పర్శ రాములు, మునిగెల రాజు, చుక్క శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్, జగ్గారావుపల్లె గ్రామాల్లోని రేషన్ దుకాణంలో శుక్రవారం ఉచిత సన్న బియ్య పంపీణీ కార్యక్రమాన్ని సిరిసిల్ల ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరు పతిరెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసమే ఈ పథకాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణకాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్, బాలకిష్టయ్య, యాదయ్య, రాజనర్సు, కనుకయ్య, అంజయ్య, ఉపేందర్, షాదుల్, తిరుపతి, మోఫిఖ్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి సిద్ధమైన రామోజిపేట శ్రీరామక్షేత్రం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామోజిపేటలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవం కన్నులపండువగా జరుగుతుంది. ఈనెల 6న ఉదయం 10 గంటలకు శ్రీరాముని జన్మోత్సవం, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు రుక్మాబట్ల సీతారామశర్మ తెలిపారు. ఉత్సవాలకు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులతోపాటు సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. హనుమాన్ మాలదారుల ప్రత్యేక భజనలు ఆకట్టుకుంటాయి. మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు జరుగుతున్నా రామోజిపేట సీతారామాశ్రమంలో జరిగే ఉత్సవాల్లో పాల్గొనడానికి భక్తులు ప్రాధాన్యమిస్తారు. కాగా, రామోజిపేట గ్రామంలోని శ్రీరామక్షేత్రం ఒక సిద్ధాశ్రమమని, ఈ ఆలయంలో 60 సంవత్సరాలుగా శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు రుక్మాబట్ల సీతారామశర్మ తెలిపారు. ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.


రామోజిపేట గ్రామంలోని శ్రీరామక్షేత్రం